


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర **రాజముద్ర**

www.rajamudranews.com

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 16.02.2026 | సంపుటి : 3 | సంచిక :15 | పేజీలు : 9 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Monday | 16.02.2026 | volume : 3 | Issue : 15 | Pages : 9 | Cost : 2/-



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## బలమైన స్థితిలో ఉండి
# బేరమాడాం



- వాణిజ్య ఒప్పందాల్లో ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా భారత్
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. 02



## మోదీ సర్కార్‌పై
# రాహుల్ దాడి

- అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు
- ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమేనని ఆరోపణ

02

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.




## భారత్ చేతిలో
# పాకిస్థాన్ చిత్తు

## చెలరేగిన ఇషాన్ కిషన్
## విజృంభించిన టీమ్‌ఇండియా బౌలర్లు

07

పిచ్ బ్యాటింగ్‌కు తగినంత అనుకూలంగా లేదు... బంతి ఆగుతూ నెమ్మదిగా వస్తోంది. భారత్ ఇన్నింగ్స్ రెండో అర్ధభాగంలో ఇది కనిపించింది కూడా. కానీ ఆరంభంలో ఇషాన్ కిషన్ చూపించిన దూకుడు పిచ్‌ను లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేకుండా చేసింది. మిగతా జట్టంతా కలిసి ఎక్స్‌ట్రాలు సహా 80 బంతుల్లో 98 పరుగులు రాబడితే... ఇషాన్ ఒక్కడే మిగిలిన 40 బంతుల్లో 77 పరుగులు చేసి మ్యాచ్‌లో అసలు తేడా ఏంటో చూపించాడు.

టి20 వరల్డ్ కప్‌లో పాకిస్తాన్‌పై అత్యధిక స్కోరు నమోదు చేసిన తర్వాత ప్రత్యర్థిని నిలువరించడం భారత్‌కు ఏమాత్రం కష్టం కాలేదు. ఆరుగురు బౌలర్లు కనీసం ఒక్క వికెట్ అయినా పడగొట్టగా, సమష్టి ప్రదర్శనతో పాక్‌ను టీమిండియా కుప్పకూలింది. ఐదు ఓవర్ల లోపే టాప్-4 వికెట్లు కోల్పోయిన పాక్ కోలుకోలేకపోయింది. అసలు పాకిస్తాన్ తమకు ఏమాత్రం పోటీ కాదన్నట్లుగా నిరూపిస్తూ భారత్ ఏకపక్షంగా ఘన విజయం అందుకుంది.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి
# కట్టుబడి ఉన్నాం

- 'నేనే రాజు.. నేనే మంత్రి' వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారు
- మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నా పనితీరుకు గీటురాయి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలోని అన్ని తండాల్లో బీటీ రోడ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తండాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దేశాన్ని ఏలేలా యువత ముందుకు సాగాలని, అందుకు ఏం కావాలన్నా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో లంబాడా సోదరులు తోడుగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. తాను పుట్టి పెరిగిన అచ్చంపేట ప్రాంతంలో సేవాలాల్ ఆలయం నిర్మించేందుకు 20 ఎకరాల స్థలం కేటాయించినట్లు వెల్లడించారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 15 : సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంత్యుత్సవాలు బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ ఆరాధన (బోగ్‌బండార్) గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు, హస్తకళల ప్రదర్శన ఆకట్టుకుంది. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవగా.. ఆ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్ తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సన్మార్గం ద్వారా అభివృద్ధి వైపు నడవాలని బోధించిన సేవాలాల్ జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించడం మా బాధ్యత. తెలంగాణ రాష్ట్రం

మిగతా 2 లో



## హరహరమహాదేవ

మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. హరహరమహాదేవ ధ్వానాలతో మార్మోగాయి. పర్వదినాన ముక్కంటిని కనులారా దర్శించుకోవాలని.. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ప్రముఖ శివాలయాలైన వేములవాడ, హనుమకొండ రుద్రేశ్వరాలయం సహా అన్ని క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గుడులకు తరలివచ్చిన భక్తులు పుణ్యస్నానాలు, అభిషేకాలతో తరించారు.



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## మా కార్పొరేటర్లు, కౌన్సిలర్లను
# కిడ్నాప్ చేశారు

### కాంగ్రెస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు : కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** మునిసిపల్ ఎన్నికల సదర్భంగా రాష్ట్రంలో దాదాపు 34 చోట్ల హంగ్ పరిస్థితులున్నాయని, ఆయా ప్రాంతా ల్లో కాంగ్రెస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఎత్తుకుపోవడం, ప్రలోభపెట్టడం, పోలీసులను ఇంటింటికి పంపించడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

మిగతా 2 లో



# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటులో బంజారాలది ప్రత్యేక పాత్ర. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు.. ప్రభుత్వంలోనూ గిరిజనులకు సముచిత స్థానం ఉంటుంది" అని హామీ ఇచ్చారు. చదువుతోనే బతుకులు మారతాయి. ప్రతి తండాలో తప్పనిసరిగా పాఠశాల ఉండాలన్న సీఎం రేవంత్.. గ్రామ పంచాయతీ భవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. "అన్ని తండాలకు సౌర విద్యుత్తు ఇచ్చి.. సాగు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. గత ప్రభుత్వానికి పదేళ్ల పాలనలో పేదలకు రేషన్‌కార్డులు ఇచ్చేందుకు చేతులు రాలేదు. మేం వచ్చాక రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా మార్చాం. రాష్ట్రంలో 3.71 కోట్ల మందికి సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. 51 లక్షల పేద కుటుంబాల ఇళ్లకు ప్రతి నెల 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.9 వేల కోట్లు వెచ్చించాం. గిరిజన విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచి వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నాం. 563 మంది గ్రూప్-1 అధికారులతో పాటు మొత్తం 70 వేల ఉద్యోగాలను భర్తీ చేయగా.. వాటిలో 85 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకే దక్కాయి. బలహీనవర్గాల యువతకు చదువే అన్ని హోదాలను తెచ్చిపెడుతుంది.

### మేం సేవకులమే కానీ పాలకులం కాదు

నేనే రాజు నేనే మంత్రి.. అని నేను అన్న మాటలను కొందరు వక్రీకరించి రాస్తున్నారు. మేం సేవకులమే కానీ.. పాలకులం కాదు. ముఖ్యమంత్రి, మున్సిపల్ మంత్రి నేనే కాబట్టి.. పురపాలక ఎన్నికల బాధ్యత తీసుకున్నా. ఈ ఎన్నికల ఫలితాలే నా పనితీరుకు గీటురాయి. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ఎవరైతే మోసం చేశారో.. వారే దళితుడిని అధ్యక్షా అని పిలిచేలా చేశాం. దేశంలోని 15 కోట్ల మంది బంజారాలు దర్శించుకునేలా.. అచ్చంపేటలో సంత్ సేవాలాల్ ఆలయం నిర్మించుకుందాం. వచ్చే ఏడాది వేడుకలు అక్కడే జరుపుకొందాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ ఏపీలోని అనంతపురం జిల్లాలో పుట్టినా తెలంగాణలో లంబాడాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల అడవుల్లో సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, మాజీ మంత్రి రవీందర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఆ శాఖ అదనపు సంచాలకుడు విట్టా సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బలమైన స్థితిలో ఉండి బేరమాడాం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

### బలమైన స్థానంలో ఉండి బేరమాడాం

అమెరికాతో ట్రేడ్ డీల్ విషయంలో ప్రతిపక్షాల విమర్శలను ప్రధాని తిప్పికొట్టారు. ట్రేడ్ డీల్స్ చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాసాలు నిర్వహించామని తెలిపారు. 'ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించటంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. దానివల్లే మేం బలమైన స్థితిలో ఉండి వాణిజ్య ఒప్పంద చర్చల్లో బేరసారాలు నిర్వహించగలిగాం. వస్త్రాలు, తోలు, కెమికల్స్, చేతివృత్తులు, రత్నాలు తదితర రంగాల్లో ఎంఎస్ఎంఈ పరిశ్రమలు మరింత విస్తరించేలా ఎఫ్‌టీఏలను డిజైన్ చేశాం' అని ప్రధాని మోదీ విమర్శిచారు.

### ప్రైవేటు రంగానిదే కీలకపాత్ర

దేశ అభివృద్ధిలో ఇకపై ప్రైవేటు రంగమే కీలకపాత్ర పోషించనుందని ప్రధాని తెలిపారు. ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం, అంతర్జాతీయ పోటీని తట్టుకొనే విషయాల్లో ప్రైవేటు రంగ సంస్థలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టడంపైనే వికసిత్ భారత్ తర్వాతి దశ ఆధారపడి ఉందని చెప్పారు. వికసిత్ భారత్ ఆవిష్కరణలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. 'వచ్చే పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు, శక్తిమంతమైన ఆవిష్కరణలు, పరిపాలనలో మరింత సరళత అనే మూడు లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం ఇస్తాం. స్థిరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగంలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టడం, మౌలిక వసతుల కల్పనను కొనసాగించటం, డిజిటల్ పరివర్తనలపైనే దేశ వృద్ధి ఆధారపడి ఉంది. ప్రాథమిక స్థాయి నుంచి సంస్కరణలు చేపట్టడం వల్లనే నేడు ప్రపంచానికి భారత్ డిజిటల్ లీడర్‌గా ఎదిగింది. డాటా సెంటర్లు యువతకు భారీగా ఉద్యోగాలు కల్పించగలవు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను మనదేశంలో డాటా సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఆహ్వానిస్తున్నాం. తర్వాతి తరం టెక్నాలజీ విప్లవానికి నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

### మా ప్రతి బడ్జెట్ ప్రత్యేకమే..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో కలిపి తాను గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వాధినేతగా ఉన్నానని మోదీ గుర్తు చేశారు. ఈ 25 ఏళ్లలో తాము రూపొందించిన ప్రతి బడ్జెట్ దేశాభివృద్ధిలో దేనికదే ప్రత్యేకమైనదని తెలిపారు. ఒక్కటి కూడా సాదాసీదా బడ్జెట్ కాదని పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా స్వల్పకాలిక లక్ష్యాలతో రూపొందించినది కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రూపొందించినదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మన రక్షణ రంగాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. అందులో భాగంగానే 2026-27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి నిధులు పెంచినట్లు చెప్పారు. కాగా, ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. చాలా జాగ్రత్తగా రూపొందించిన స్క్రిప్టు ప్రకారం ఇంటర్వ్యూ సాగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ప్రధాని పబ్లిసిటీ స్టంటులో ఇదో భాగమని ఎద్దేవా చేశారు.

# రైతులకు పూర్తి రక్షణ...

## రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు : అమిత్ షా.

- యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు.. ఖండించిన అమిత్ షా
- రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి
- యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి
- విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్



**గాంధీనగర్, ఫిబ్రవరి 15:** అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. "70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది" అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మా కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారు

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీల దోపిడీని అడ్డుకునేందుకు కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని తాము ముందుకు వచ్చినట్లు తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్ ఇప్పటికే పొత్తులో ఉన్నాయని, ఆ పార్టీలు కొత్తగూడెంలో మేయర్ పదవి పంచుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం సాగిస్తామని, కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న దోపిడీని అడ్డుకోవడమే తమ లక్ష్యమని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి సింగరేణి దోపిడీలో భాగస్వాములై సంస్థను నష్టపరిచేవిధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల కోసం గతంలో పోరాడినట్లుగానే.. భవిష్యత్తులోనూ పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించామని గుర్తు చేశారు.




# మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి

- అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు
- ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమేనని ఆరోపణ

**న్యూఢిల్లీ:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిందన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఐదు ప్రశ్నలు సంధించారు.

- డీడీజీ దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసిన (+వీ) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా?
- జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా?
- మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా?
- వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా?
- ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.
- ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని రాహుల్ పేర్కొన్నారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.



# సైన్యానికి బదులు పొట్టను పెంచుతున్నారు : హంగరీ పీఎంపై జెలెన్‌స్కీ

**ఉక్రెయిన్ :** రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హంగరీ వెనుకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.. పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు రష్యాతో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయాలని ఐరోపా దేశాలను కోరారు. యుద్ధ విరమణ అమలు కోసం మాస్కోపై ఒత్తిడి పెంచాలని.. లేదంటే రష్యా మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రష్యాతో యుద్ధాన్ని ఆపడానికి ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తుండగా.. హంగరీ మాత్రం రష్యాకు సహాయం చేస్తూ వస్తోంది. ఆ దేశంపై యూరప్ దేశాలు విధించే ఆంక్షలను పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించింది. యుద్ధం సమయంలో కీవ్‌కు అదనపు నిధులు, ఆయుధాలు నేరుగా సరఫరా చేయాలని ఈయూ దేశాలు ఇచ్చిన పిలుపును ప్రతిఘటించింది. అంతే కాకుండా పుతిన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెలెన్‌స్కీ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అబుదాబి వేదికగా ఇటీవల నిర్వహించిన రెండో విడత భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

# జమ్మూ కేంద్రంగా 'డిజిటల్ హవాలా'..

## 8వేల నకిలీ ఖాతాలు గుర్తింపు

**న్యూఢిల్లీ :** జమ్మూ కశ్మీర్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తోన్న 'డిజిటల్ హవాలా' వ్యవస్థను జాతీయ దర్యాప్తు సంస్థ ఛేదించింది. అంతర్జాతీయ స్కామ్ సిండికేట్‌లతో సంబంధం ఉన్న దాదాపు 8వేలకు పైగా నకిలీ బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసింది. సైబర్ మోసాలతో దోచుకున్న డబ్బును వేర్పాటువాద, ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. వివిధ దర్యాప్తు సంస్థలతో కలిసి మూడేళ్లుగా చేస్తున్న విచారణతో ఈ డిజిటల్ హవాలా వ్యవస్థ బట్టబయలయ్యింది. అక్రమ ఆర్థిక లావాదేవీలపై జమ్మూ కశ్మీర్ పోలీసులతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి పెడుతుండడంతో.. కొన్నేళ్లుగా నగదు అక్రమ రవాణాకు నేరగాళ్లు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు తేలింది. సాధారణ హవాలా మార్గాలకు బదులు 'డిజిటల్ హవాలా'ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అనేక సందర్భాల్లో సాధారణ పౌరుల గుర్తింపు కార్డులను ఉపయోగించి షెల్ కంపెనీల పేర్లతో నకిలీ ఖాతాలు తెరుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి ద్వారా రోజుకు రూ.లక్షల్లో డబ్బును ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నట్లు వెల్లడైంది. బ్యాంకు అధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు భారీ నగదును చిన్న మొత్తాల్లో విభజిస్తూ లావాదేవీలు చేస్తుండటం గమనార్హం. ఈ ఖాతాల ద్వారా అమాయకుల నుంచి దోచుకున్న డబ్బులను నిందితులు ఎప్పటికప్పుడు క్రిప్టోకరెన్సీ రూపంలోకి మార్చుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇటువంటి హవాలా ఖాతాల కట్టడికి స్థానిక బ్యాంకులతో కలిసి పనిచేయాలని జమ్మూ కశ్మీర్ పోలీసులకు, ప్రభుత్వ విభాగాలకు ఎన్ఐఏ సూచించింది.



# సింగరేణిలో కాంగ్రెస్ దోపిడీపై పోరాడుతూనే ఉంటాం

- అందుకే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ప్రకటించాం
- ఎందుకు వద్దనుకున్నారో వాళ్లకే తెలియాలి
- సేవాలాల్ జయంతి వేడుకల్లో కేటీఆర్

**హైదరాబాద్:** సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని, దానిపై తమ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. సింగరేణిలో కాంగ్రెస్ దోపిడీని అడ్డుకునేందుకే కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు ప్రకటించామని, కానీ వారిపై ఏమి ఒత్తిడి ఉందో.. ఎందుకు పొత్తు వద్దనుకుంటున్నారో వారికే తెలియాలని ఆయన అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. 'భాజపా, కాంగ్రెస్ రెండూ కలిసి సింగరేణి అక్రమాల్లో భాగస్వాములై సంస్థను నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయి. సీపీఐ, కాంగ్రెస్ ఇప్పటికే పొత్తులో ఉన్నాయి. కొత్తగూడెంలో మేయర్ పదవి పంచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఏఐటీయూసీ వంటి సీపీఐ అనుబంధ సంస్థ ఈ పొత్తును ఎందుకు అంగీకరించిందో తెలియదు. దాని వెనుక ఏ ఒత్తిళ్లు పని చేశాయో నేను చెప్పలేను. ఎవరు కలిసి వచ్చినా.. రాకపోయినా సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల కోసం గతంలో ఎలా పోరాడామో.. భవిష్యత్తులో కూడా అలాగే పోరాడుతాం. రాష్ట్రంలో దాదాపు 34 చోట్ల హంగ్ పరిస్థితులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారు. 'మా తండాల్లో మా రాజ్యం' ఉండాలన్న నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చి.. గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేసిన నాయకుడు కేసీఆర్. గిరిజన, కోయ గూడేలు, లంబాడా తండాలకు ప్రాధాన్యం ఇస్తూ.. 3,146 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి, వేల మంది గిరిజన యువతకు సర్పంచులు, వార్డు సభ్యులుగా అవకాశాలు కల్పించారు. భారాస మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు అండగా నిలబడతాం" అని కేటీఆర్ హామీ ఇచ్చారు.

శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి, శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా మంది వాకింగ్ చేస్తూ ఉంటారు. వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. సాధారణంగా మనం వాకింగ్ చేస్తున్నప్పుడు కాళ్లు, తొడలు, పిరుదులు వంటి భాగాల్లో నొప్పి వస్తూ ఉంటుంది. ఇది అడపాదడపా జరుగుతుంది. కొంత విశ్రాంతి తీసుకున్న తరువాత తగ్గిపోతుంది. కానీ వాకింగ్ చేసేటప్పుడు కాళ్ల నొప్పి ఎక్కువగా ఉండడం, విశ్రాంతి తీసుకున్న తరువాత కూడా తగ్గకపోవడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను కూడా సూచిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అధిక కొలెస్ట్రాల్ సమస్య ఎక్కువగా ఎటువంటి లక్షణాలు చూపించదు. వాకింగ్ చేసేటప్పుడు మన శరీరం కొన్ని లక్షణాలను చూపిస్తుంది.



# అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉందా..?

## ఈ లక్షణాన్ని గమనించండి..!



### కొలెస్ట్రాల్ అడ్డుపడితే..

ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుపడడం వల్ల నడిచిన ప్రతిసారి నొప్పితో పాటు వింత అనుభూతి కలుగుతుంది. ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుగా ఉండడం వల్ల నడిచేటప్పుడు ఆక్సిజన్ ఉన్న రక్తం సరిగ్గా సరఫరా అవ్వదు. దీంతో నడిచేటప్పుడు నొప్పితో పాటు కాళ్లు బరువుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెట్లు ఎక్కడం కూడా కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల కాలక్రమేణా రక్తప్రసరణ బలహీనపడుతుంది. కండరాలు కుచించుకుపోతాయి. కొంతకాలానికి నడవడం, నిలబడడం కూడా కష్టతరంగా మారుతుంది. అంతేకాకుండా నడిచిన తరువాత ఒక కాలు చల్లగా మరో కాలు వేడిగా ఉండడం వంటి లక్షణాలు కూడా ధమనుల్లో అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. రక్తం వెచ్చగా ఉంటుంది. రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవడం వల్ల కాలు తగినంత వేడెక్కక చల్లగా ఉంటుంది. నడిచిన తరువాత కాలు చల్లగా ఉండడం, కాలు రంగు మారడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.



### కాళ్లల్లో తిమ్మిర్లు, గుచ్చినట్లుగా ఉండడం..

అలాగే నడిచేటప్పుడు కాళ్లు తిమ్మిర్లు రావడం, గుచ్చినట్టుగా ఉండడం కూడా ఒక సంకేతమే. నడిచేటప్పుడు నరాలకు ఆక్సిజన్ తో కూడిన రక్తం నిరంతరం సరఫరా అవ్వాలి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల రక్తం సరఫరా అవ్వక నరాల పనితీరు దెబ్బతింటుంది. దీంతో పాదాల్లో తిమ్మిర్లు, మంట, స్పర్శ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసేకొద్దీ పాదాలపై అల్సర్లు, ఇన్ఫెక్షన్లు, పాదాలపై నెమ్మదిగా గాయాలు అయ్యే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పాదాల రంగు మారడం..

అలాగే అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారిలో నడిచిన తరువాత పాదాల రంగు మారుతుంది. చర్మం పాలిపోయినట్టు కనబడడం, నీలి లేదా ఊదా రంగులో కనబడడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల చర్మ కణజాలానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది. సమస్య పెరిగే కొద్దీ కాళ్లపై వెంట్రుకలు ఊడిపోవడం, కాలి వేళ్లపై, పాదాలపై నయం కాని పుండ్లు పడడం కూడా జరుగుతుంది. కనుక నడిచే సమయంలో ఇటువంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అధిక కొలెస్ట్రాల్ సమస్య గుండె జబ్బులకు, స్ట్రోక్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. కనుక అధిక కొలెస్ట్రాల్ సమస్యను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.



## మహా శివరాత్రి శుభాకాంక్షలు

**దేవస్థాన కమిటీ చైర్మన్ గుండెగాని అయిలయ్య గౌడ్**

**ఆత్మకూరు (ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం).మండల కేంద్రంలో గల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు తమ తమ మొక్కలు చెల్లించి స్వామివారికి అభిషేకములు అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావడం జరిగినది ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ గుండెగాని అయిలయ్య. గౌడ్ మాట్లాడుతూ ఈ మహాశివరాత్రి సందర్భంగా ఆ స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు మా గ్రామ ప్రజలందరికీ ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నామన్నారు .



## సర్పంచ్ ప్రత్యేక పూజలు

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం).మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్. దంపతులు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుండె గాని ఐలయ్య గౌడ్,బీజేపీ మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, బబ్బూరి శివలింగం గౌడ్, బి ఎల్ నారాయణ గౌడ్ దంపతులు, ప్రతి కంఠం శంతాన్ రాజు దంపతులు, లోడి శంకర్ గౌడ్ దంపతులు, లోడీ పరశురాములు, సూర్య, గర్దాసు లింగయ్య తిరుపతి తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా కామ్రేడ్ ధర్మభిక్షం గౌడ్ 104వ జయంతి వేడుకలు

**ఆత్మకూరు(ఎం): రాజముద్ర న్యూస్ :** మాజీ పార్లమెంట్ సభ్యులు,కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం గౌడ్ 104 వ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు వద్ద ఆయన విగ్రహానికి సర్పంచ్ బీసు లిధనలక్ష్మి చందర్ గౌడ్. పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామ్రేడ్ ధర్మ బిక్షం తెలంగాణలోని పేద ప్రజల కోసం మరియు గీత కార్మికులకు హక్కుల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బీసు చందర్ గౌడ్, గనగాని మల్లేష్ గౌడ్, గుండెగాని ఐలయ్య, నాతి రాజు, రంగ సత్యనారాయణ, లోడి శ్రీను పొన్నగాని జహంగీర్,బొడిగె వెంకన్న,పోతగాని మల్లేష్,రంగ స్వామి, పంజాల కృష్ణమూర్తి, శిగ శ్రీను,మాధ సత్తయ్య,రంగ వెంకన్న,బూడిద రాజు, నర్సయ్య, లోడి రవి, పరకాల వెంకటయ్య, చెరుకు శీను, బబ్బురి శివలింగం, రంగ శ్రీను,చెరుకు విష్ణు, బూడిద శేఖర్,రాగటి మచ్చగిరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు





## సింగారంలో ఎస్సీ కాలనీవాసులకు టెంట్ హౌస్‌ను అందజేసిన ఝాన్సీ పురుషోత్తం రెడ్డి

**ఆత్మకూరు( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు ( ఎం),, మండలంలోని సింగారం గ్రామం లో. ఎస్సీ కాలనీవాసులకు బి ఆర్ ఎస్ నాయకులు సప్పిడి ఝాన్సీ పురుషోత్తం రెడ్డి ఆదివారం 2 లక్షల విలువ చేసే టెంట్ హౌస్ ను అందజేశారు. ఈ సందర్భంగా దాత ఝాన్సీ పురుషోత్తం రెడ్డిని ఎస్సీ కాలనీవాసులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు వల్లాల రాములు, శ్రీహరి, వెంకట్ రెడ్డి, చంద్రయ్య, శ్రీరాములు, సిద్దులు, పాల సంఘం చైర్మన్ బిక్షపతి, ఎస్సీ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మరకత శివాలయానికి పోటెత్తిన భక్తులు

**మహాశివరాత్రి సందర్భంగా శివున్ని దర్శించుకున్న సుమారు లక్ష మంది భక్తులు**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం వేకువ జామున ఉదయం ఒంటిగంట నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం 6 గంటల వరకే అభిషేకాలకు అనుమతిని ఇచ్చారు. అనంతరం స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ లైన్ లో బారులు తీరారు. గర్భాలయ దర్శనాలకు అనుమతించడంతో విడతలవారీగా దర్శనాల టిక్కెట్ల కోసం భక్తులు పోటీ పడ్డారు. దీంతో ఆలయ ప్రాంగణంలోని అన్ని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అదే విధంగా ఉచిత దర్శనానికి సుమారు మూడు గంటలకుపైగా సమయం పట్టింది. కళారాధన కార్యక్రమాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. చేవెళ్ల కోర్టు జడ్జి దంపతులు, దేశముఖ్ అనూష అవనందరెడ్డి, తహసిల్దారు సురేందర్ దంపతులు, సిఐలు శ్రీనివాస్ గౌడ్, సతీష్, క్రాంతి కుమార్ దంపతులు, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, యాంకర్, వైయస్సార్ సిపి అధికార ప్రతినిధి శ్యామల, స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. చేవెళ్ల, శంకర్ పల్లి, నార్సింగ్ పోలీస్ స్టేషన్ ల నుండి 70 మంది పోలీసు సిబ్బంది ఆలయ ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు వెంకటే శ్వర రావు (వీడియో రావు), ప్రచార కమిటీ చైర్మన్ దయాకర రాజు స్వామి, చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, కోశాధికారి జనార్ధన్, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్ గౌడ్, మాజీ చైర్మన్ సదానందం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా అన్నదానం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి పట్టణంలో శ్రీవైద్య నాథ స్వామి దేవాలయం వద్ద 5000 భక్తులకి పులిహార, మిలిటరీ వాటర్,మజ్జిగ పంపిణీ నేలకొండపల్లి మండల భక్త రామదాసు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో యూత్ సభ్యులు జెర్రిపోతుల అంజని, సోమనబో యిన సాయి నవీన్,రాయపూడి రోహిత్,కాసాని మహేష్, దగ్గుల ఏకనాథ్ రెడ్డి,కాసాని సిద్ధార్థ,యడవల్లి నాగరాజు,తాత అఖిల్, అనంత్ మనోజ్,భూక్య మనోజ్,అనంత మనోజ్, గుండు మహేష్, సోమనబోయిన సాయి నవీన్, రామగిరి చిద్విల్, జెర్రిపోతుల బాబీ,రాచకొండ పవన్ కళ్యాణ్,వెంకట సాయి, గొలుసు పవన్, ఎర్ర శివ, కైలాసపు గోపి,నిమ్మగడ్డ కిరణ్ చింతకాయల సురేష్, మహేష్,మండల పెద్దలు నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య,దోసపాటి శేఖర్,రేపూరి హనుమంతరావు, జెర్రిపోతుల సత్యనారాయణ,జాన్ రెడ్డి,మామిడి వెంకన్న, మావిడి ముత్తయ్య ,సోమనబోయిన వెంకన్న, దేవరశెట్టి లక్ష్మణరావు, ఎండూరి బ్రహ్మం,గుడిబోయిన వెంకటేశ్వర్లు, లక్కం కొండలు,అయితన పోయిన శ్రీను,దోసపాటి కల్పన, రేగూరి వాసవి,కొండా ఉపేందర్,మాటూరి సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు గాజుల వెంకటేష్, కడియాల నరేష్ , తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో బోనాల ఊరేగింపు




**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** మహాశివరాత్రి సందర్భంగా రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో శివాలయం కాశీ విశ్వేశ్వర స్వామి శ్రీ రాజరాజేశ్వర స్వామి టెంపుల్ నుండి మహిళలు బోనాలు నంది విగ్రహం వరకు బోనాలు తీసుకురావడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్, గ్రామ పెద్దలు వి డి సి పెద్దలు, పాలకవర్గం ,గ్రామ పెద్దలు, యువకులు ,అక్కా చెల్లెలు అందరూ మంచి ఉత్సాహంతో కలిసే బోనాలు నంది విగ్రహం వద్దకు తీసుకోవచ్చు పూజలు చేశారు.



## మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు

**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం). మండలం రహీంఖాన్ పేట గ్రామ శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్. నాగుల సత్యనారాయణ యాదవ్. దంపతులు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు రహీంఖాన్ పేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మనస్పర్ధలతో వివాహిత ఆత్మహత్య



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్ పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సంగారెడ్డి రోడ్డులో నివాసం ఉంటున్న రాజు శర్మ, కవిత(38) దంపతులు. వీరు 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం శంకర్ పల్లికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 17 ఏళ్ల కూతురు భూమిక ఉంది. అయితే కవిత అక్క సుమలత, మల్లయ్య దంపతులు, వారి కుమార్తె చంద్రకళ సైతం పట్టణంలోని గణేష్ నగర్ లో నివాసం ఉంటున్నారు. అయితే గత కొంతకాలంగా చంద్రకళ ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఆమెని మందలించి.. దీనికి భూమికనే కారణం అంటూ ఆరోపించారు. ఈ విషయంపై తల్లి కవిత, కూతురు భూమిక మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. దింతో మనస్థాపానికి గురైన కవిత ఇంట్లోని కిటికీ చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త రాజు శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్ పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామంలో వెలిసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, ఉప్పల్ వాయి లో వెలసిన శ్రీ వన దుర్గ రామలింగేశ్వర స్వామి, పోసానిపేటలో వేసిన రాజరాజేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతూ శివనామ స్మరణతో మారుమోగిపో యాయి, అంగరంగ వైభవంగా రథోత్సవాలు ఊరేగింపు నిర్వహించారు, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బంజార జాతిని సన్మార్గంలో నడిపిన మహనీయుడు సేవాల్ లాల్ మహారాజ్

- **లంబాడీలకు హిందూధర్మం గురించి చెప్పిన గొప్ప మహనీయుడు సేవాలాల్ మహారాజ్**
- **ప్రత్యేక పూజలు, భోగ్ బండార్ నిర్వహించిన బంజార నాయకులు**




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** బంజార జాతిని ఐక్యం చేసి సన్మార్గం లో నడిపిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మంగ్తా నాయక్,సంత్ శ్రీ సేవాల్ లాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ లానా వత్ పాండు నాయక్ లు అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని బంజార్ భవన్ లో కో-కన్వీనర్ గుగులోతు నాగు నాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నాడు సంచార జీవనం కొనసాగిస్తున్న లంబాడీలను గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ హింస,మద్యపానం, ధూమపానం వంటి వాటిని వీడి ప్రతీ ఒక్కరికి హింధూధర్మం గురించి చెప్పి వారిని చైతన్యం చేశారని చెప్పారు.బ్రిటిష్,ముస్లిం పాలకులు నాడు లంబాడీలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న తరుణంలో వారికి వ్యతిరేకంగా ఆయన ఎన్నో ఉద్యమాలను నిర్వహించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సేవా లాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించ సెలవుది నంగా ప్రకటించినట్లు గుర్తు చేశారు.పాలకులు లంబాడీలను విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రత్యేక కార్యచరణ తీసుకోవాలని వారు కోరారు. ఇప్పటికైన లంబాడీలు ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకునేందుకు ముందుకు సాగాలన్నారు.లంబాడీల సహకారంతో జిల్లా కేంద్రంలో నిర్మాణం చేపట్టిన ఈ బంజార భవన్ పూర్తి నిర్మాణాన్ని ముందుకు సాగించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అంతకు ముందు సేవాలాల్ మహరాజ్ భోగ్ బండార్ కు ప్రత్యేక నైవేద్యం వండి స్వామివారికి సమర్పించి లంబాడీలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు నాయక్, డిప్యూటి తహసీల్దార్ ఎల్ లావణ్య,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు, కౌన్సిలర్లు,రాజకీయ పార్టీల నాయకులు,బంజార ప్రజా సంఘాల నాయకులు,ఉద్యోగ, ఉపాధ్యాయ,విద్యార్థి సంఘాల నాయకులు,వివిధ తండాల నుండి వచ్చిన బంజారలు తదితరులు పాల్గొన్నారు.

# శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- భక్తుల సందర్శనతో పోటెత్తిన ఆలయాలు
- సంగమేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ దంపతుల ప్రత్యేక పూజలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** హర హర మహాదేవ... శంభో శంకరా అంటూ శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. శనివారం అర్ధరాత్రి నుంచే శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినంగా భావించే మహా శివరాత్రి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శివాలయాల వద్ద తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ పెరిగి, "ఓం నమఃశివాయ" అనే ఓంకారనాధంతో ఆ పరిసరాలు ఆధ్యాత్మికతలో భక్తుల పరవశంతో పరవళ్లు తొక్కుతున్నాయి. ఖమ్మం పట్టణానికి కూతవేటు దూరంలో తీర్థాల గ్రామంలో కొలువైయున్న శ్రీ శ్రీ శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిట కిటలాడింది. అర్ధరాత్రి నుండే భక్తులు శివయ్యను దర్శించి భక్తి శ్రద్ధలతో పరవశించారు. ప్రత్యేక అభిషేకాలు, రుద్రపారాయణాలు, జాగరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రంతా జాగరణ చేసి భగవంతుని కీర్తనలు పాడుతూ భక్తులు





ఆధ్యాత్మిక మాధుర్యంలో మునిగిపోయారు.

### ఉపవాస దీక్షలు.. ఆధ్యాత్మిక నిబద్ధత

భక్తులు నిష్ఠగా ఉపవాసం చేసి, బిల్వదళాలు సమర్పిస్తూ పరమేశ్వరుని అనుగ్రహం కోరుకున్నారు. "శివరాత్రి రోజున ఒక బిల్వదళం సమర్పించినా పుణ్యం అపారం" అనే నమ్మకంతో కుటుంబ సమేతంగా దేవాలయాలకు తరలివచ్చారు. కొందరు భక్తులు పాదయాత్రలు చేసి క్షేత్రాలకు చేరుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఈసారి యువతలో కూడా శివరాత్రి పట్ల ప్రత్యేక ఆసక్తి కనిపించింది. సోషల్ మీడియా వేదికగా శివతత్వం, ఆధ్యాత్మిక సందేశాలు పంచుకుంటూ, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు, నిర్వహించడం విశేషం. "శివరాత్రి రోజు శివుని దర్శనం లభిస్తే జీవితానికి శాంతి చేకూరుతుంది" అని భక్తులు భావిస్తున్నారు. కష్టకాలంలో శివుని స్మరణే ధైర్యం ఇస్తుందని వారు చెబుతున్నారు. ఆధ్యాత్మిక శక్తి, సామూహిక భక్తి---ఇవి రెండూ కలిసిన పర్వదినంగా మహా శివరాత్రి నిలిచింది. భక్తి, భజన, జాగరణల మధ్య మహా శివరాత్రి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా భక్తి ఉత్సాహంతో కొనసాగుతున్నాయి.

### కలెక్టర్ దంపతుల ప్రత్యేక పూజలు

ఆదివారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కుటుంబ సమేతం గా తీర్థాల శ్రీ శ్రీ శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు కలెక్టర్ దంపతులకు వేదమంత్రోత్సరణలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో కొలువుదీరిన పరమేశ్వరుడిని దర్శించుకొని.. తెలంగాణ ప్రజలపై అనుగ్రహం చూపించాలని కోరుకున్నారు. ఆలయంలో భక్తుల సందర్శనకోసం చేసిన ఏర్పాట్లను పరిశీలంచారు. ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలని పోలీసు యంత్రాగాన్ని ఆదేశించారు. భక్తులకు 24 గంటలు వైద్య సదుపాయం అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచిం చారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు నియంత్రించాలని ఆదేశించారు.



## శివాలయానికి హైమాక్స్‌లైట్లు

**అందజేసిన పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఘనగాని మాధవి మల్లేష్ గౌడ్**

**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం రహీంఖాన్ పేట గ్రామంలో పోతిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఘనగాని మాధవి మల్లేష్ గౌడ్ రహీంకన్ పేట శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు శివాలయం చుట్టూ హైమాక్స్ లైట్లు గుడి అభివృద్ధి కోసం 50వేల 116 రూపాయలు అందజేశారు శివరాత్రి సందర్భంగా లైట్లను స్విచ్ ఆన్ చేసి ఓపెనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో రహీంకన్ పేట సర్పంచ్ సుదగాని కళావతి లింగయ్య గౌడ్. దేవస్థాన కమిటీ చైర్మన్ బురుగు వెంకటేశ్వర గౌడ్.ఉప సర్పంచ్ తాళ్లపల్లి ఉప్పలయ్య గౌడ్. నాయకులు తాళ్లపల్లి నరేందర్ గౌడ్. దేవస్థాన కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఐదుగురు స్వతంత్ర కార్పొరేటర్లు

**ఖమ్మం, ఫిబ్రవరి 15:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన ఐదుగురు కార్పొరేటర్లు ఆదివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. మంత్రి పొంగులేటి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో 1వ డివిజన్ కార్పొరేటర్ సీరపు సుగుణ, 13వ డివిజన్ కార్పొరేటర్ తలుగు శాంతా, 34వ డివిజన్ కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి, 42వ డివిజన్ కార్పొరేటర్ దున్నపోతుల మణి, 48వ డివిజన్ కార్పొరేటర్ ధర్మసోత్ నరేష్ ఉన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## సంత్ సేవలాల్ జయంతి

**దమ్మపేట, ఫిబ్రవరి 15:** బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతి దమ్మపేట బంజారా కాలనీలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావతు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీను లావుడియా బాలాజీ, పోలయ్య లక్ష్మయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి మోతెగడ్డ ఉత్సవం

- శ్రీశ్రీశ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దర్శనం
- జిల్లా బి.ఆర్.ఎస్ నేతల భక్తి, ప్రత్యేక పూజలు

**దమ్మపేట, ఫిబ్రవరి 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా చెన్నంపేటలోని మోతెగడ్డ శైవక్షేత్రంలో శ్రీశ్రీశ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారిని జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భద్రకాళి సమేత వీరభద్ర ఆశీస్సులతో జిల్లా ప్రజలు ఆరోగ్యంతో, సుఖశాంతితో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కుంజా రమాదేవి, అశ్వరావుపేట యువ నాయకులు వాడే విజయ వీరస్వామి పాల్గొన్నారు.

## విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు

- విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమిచాలి
- ఘనంగా న్యూ సాంగ్ స్కూల్ వార్షికోత్సవం

**సత్తుపల్లి, ఫిబ్రవరి 15:** రేజర్ల లోని న్యూ సాంగ్ లో 22వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 18 గ్రామాల నుండి విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు విద్య ప్రాముఖ్యతపై ప్రసంగించారు. చదువుతో పాటు బాధ్యతలు తెలుసుకోండి అని విద్యార్థులకు సూచించారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షులు (విశ్వశాంతి స్కూల్) పసుపులేటి నాగేశ్వరరావు తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే పిల్లల భవిష్యత్తు సురక్షితమని అన్నారు. విద్యారథ్యులు లక్ష్య సాధనకు శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమాత డా. సత్య సాయి, న్యాయవాది నాగ పుష్పావతి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. పాఠశాల అధ్యక్షుడు జైదీప్ ముఖర్జీ, ప్రిన్సిపాల్ సిల్వియా, కారస్పాండెంట్ డా. ముఖర్జీ విక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## పరమశివుని చెంత మంత్రి పొంగులేటి దంపతులు

- ముక్కంటి సన్నిధిలో ఆధ్యాత్మిక పర్యటన
- తీర్థాల, కూసుమంచి, బెండాలపాడు క్షేత్రాల్లో కుటుంబ సమేతంగా పూజలు
- వేద ఆశీర్వచనాల మధ్య మంత్రి దంపతులకు ఆలయాల్లో ఘన స్వాగతం

**ఖమ్మం కల్చరల్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినం వేళ ముక్కంటి చెంత భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు తమ ముద్దుల మనుమరాలు మైరాతో కలిసి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలను సందర్శించారు. పసిప్రాయంలోనే భక్తి భావంతో స్వామివారిని దర్శించుకుంటున్న మైరా మురిపెంలో మంత్రి కుటుంబ సభ్యులు ఆధ్యాత్మికంలో మునిగితేలారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ పర్యటనలో మంత్రి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు.



### తీర్థాల, కూసుమంచిలో ఆధ్యాత్మిక వెలుగులు

మంత్రి కుటుంబం తొలుత పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీ సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకుంది. త్రివేణి సంగమ క్షేత్రంలో వెలసిన స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మనుమరాలు మైరాతో కలిసి మంత్రి దంపతులు పూజల్లో పాల్గొన్న దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం చారిత్రక ప్రసిద్ధి గాంచిన కూసుమంచి శ్రీ గణపేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. కాకతీయుల శిల్పకళా వైభవానికి నిలువుటద్దంగా నిలిచే ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు.



### బెండాలపాడు వీరభద్రుడికి నీరాజనం

పర్యటనలో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం బెండాలపాడులోని పల్లెర్లబావి శ్రీ వీరభద్రస్వామి వారిని మంత్రి దంపతులు సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో మంత్రి దంపతులతో పాటు చిన్నారి మైరాకు అర్చకులు ఆత్మీయ స్వాగతం పలికారు. వీరభద్రుడి సన్నిధిలో భక్తిప్రపత్తులతో నిర్వహించిన విశేష పూజల్లో పాల్గొన్నారు.

### రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..

దర్శనానంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. "మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో విరాజిల్లాలని, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నాను" అని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

- సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శం
- గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి - కొండ

**బోనకల్, ఫిబ్రవరి 15:** బంజారా సమాజ ఆధ్యాత్మిక గురువైన సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బోనకల్ గ్రామంలోనీ గిరిజన కాలనీలో.. సేవాలాల్ జయంతి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ కొండ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహారాజ్ ఆశీస్సులు కోరుకున్నారు. కార్యక్రమంలో 9వ వార్డ్ మెంబర్ జరుపుల లావణ్య శివకిష్ణ దంపతులు మరియు గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సర్పంచ్ జ్యోతి కొండ దంపతులు మాట్లాడుతూ... సంతు సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, ఆయన చూపిన సత్యనిష్ఠ, సేవాభావం ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధి, సామాజిక ఐక్యత కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. ఈ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సంతోషంగా, శాంతియుత వాతావరణంలో కొనసాగాయి.



## ఘన పూజల ఉత్సవం

- శంభో లింగేశ్వర స్వామికి అభిషేకం
- జ్యోతి - కొండ దంపతుల సహకారం
- ప్రసాదాలతో ముగిసిన మహోత్సవం

**బోనకల్, ఫిబ్రవరి 15 :** బోనకల్ గ్రామంలోని శంభో లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఘన ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ కొండ దంపతులు స్వయంగా పాల్గొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పూజలు గ్రామ ప్రజల శ్రేయస్సు, మంచి వర్షాలు, పంటల సమృద్ధి, ఆరోగ్య సౌఖ్యాలకు నిర్వహించబడ్డాయి. ఆలయ ప్రాంగణం మహిళలు, యువత, పెద్దలతో కిటకిటలాడింది. సర్పంచ్ జ్యోతి – కొండ దంపతులు "గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తాము, ప్రజల సహకారంతో బోనకల్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దతాము" అని తెలిపారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయబడినది. శివాలయం కమిటీ సభ్యులు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓట్స్‌ను రోజూ తింటే అద్భుతమైన లాభాలు!

మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.



### బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు.



# శ్రీవరి సాగు.. లాభాలు బాగు



ఆరుతడి పంటలతో పాటు, శ్రీవరిసాగు సైతం రైతులను లాభాల బాటపట్టిస్తున్నది. కరువులో సైతం శ్రీవరిసాగుతో వరిపంటను అధికంగా దిగుబడి చేయవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. శ్రీవరిసాగు పద్ధతిలో మెళు కువలు పాటిస్తే మంచి పంట దిగుబడిని పొందవచ్చని పేర్కొంటున్నారు. మండలంలో శ్రీవరి సాగును మరింత విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీవరి సాగు పై మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించిన సలహాలు, జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

### శ్రీవరిసాగు పొలం తయారీ

సాధారణ వరిలాగే శ్రీవరిసాగుకు పొలం తయారు చేయాలి. వరినాటేందుకు ముందుగా కరిగట్లను సిద్ధం చేసుకుని పొలంలో ఎత్తు పల్లాలులేకుండా పొలం దున్ని సిద్ధం చేసుకోవాలి. పొలం చుట్టూ లోపలి నుంచి చిన్నచిన్న గట్లు వేసుకోవాలి. శ్రీవరిసా గులో పొలం తడిగా, బురదగా పదునుగా ఉండాలి. నీరు ఎక్కువగా నిలువ ఉండకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే బయటికి పోవటానికి పొలంలో చిన్నచిన్న లోతైన సేడులను ఏర్పాటు చేసుకుని నాట్లు వేయటానికి పొలం సిద్ధం చేసుకోవాలి.

### నారుమడి తయారు

శ్రీ' పద్ధతిలో వరినారును 8 నుంచి 12 రోజుల్లో నాటాలి. నారు పెంచటంలో తగిన మెళకువలు పాటించాలి. దీనికోసం రెండుకిలోల మేలిరకం విత్తనాన్ని ఒక సెంటుభూమిలో పలుచగా చల్లి, పెంచితే ఎకరా పొలంలో నాటవచ్చు. భూమిని మెత్తగా దున్ని, దుమ్ము చేసి, కొంచెం ఎత్తుగా తయారుచేసి, దానికి చుట్టు కాలువ తీయాలి. తడి మట్టి జారిపోకుండా నారుమడి చుట్టూ వరిఎండు గడ్డితో కానీ వెదురు బొంగులతో ఊతం ఏర్పాటు చేయాలి. నారుమడి తయారైన తర్వాత పశువుల ఎరువులను ఒక పొరలాగా చల్లాలి. దానిమీద 24గంటలు నానబెట్టి, మండికట్టిన విత్తనాలను పలుచగా చల్లాలి. విత్తనాలపైన పలుచగా పశువుల ఎరువులను వేసి ఉంచాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. పశువుల ఎరువును వేయాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. దానిపై రోజూ నీరు చల్లుతూ తడపాలి. ఎనిమిది రోజుల్లో వరినారు రెండు నుంచి మూడు ఆకులతో ధృఢంగా పెరుగుతుంది. నారుమడి నుంచి నారును పాతపద్ధతిలో పీకకుండా మట్టితో సహావేరు చేసి ప్లాస్టిక్ ట్రేలలో పొలానికి నారును తరిలించాలి.

### వరినాట్లు వేసే విధానం

నాట్లు వేసేందుకు తయారుచేసిన పొలంలో 25పొడవు, 25 సెం.మీ. ఎడంగా ముందుగా గీతలు గీసుకోవాలి. గీతలు గీసే ప్రాంతంలో ఒక్కొక్క మొక్కను పైపైగా నాటాలి. బురద మట్టిలో సహా మొక్కలను నాటితే వాటిపై ఒత్తిడిలేకుండా స్థిరంగా బలంగా పెరుగుతాయి. మొక్కలు నాటేటప్పుడు నేల బురదపదు నుగా ఉండాలి. మొక్కలను నిటారుగా, జాగ్రత్తగా నాటితేనే పంట మంచి దిగుబడినిస్తుందని నిపుణులు సూచించారు.

### కాలిబాటలు తీసే విధానం..

శ్రీవరిసాగు పద్ధతిలో ప్రతి 25సెం.మీ.నాట్లు వేయుటకు ముందుగాని 15-20 సెం.మీ. వెడల్పు 15-20 సెం.మీ.లోతులో పొలంలో పొలంలో బాటలు తీయాలి. దీని వలన గాలి, వెలుతురుతో పాటు నీరు పెట్టుకోవటానికి వీలుగా ఉంటుంది. దీంతో రైతుపొలంలో అటూఇటూ తిరిగేందుకు సైతం వీలుగా ఉంటుంది. దీంతో చీడపీడలు సైతం పంటను అంతగా ఆశించవు.

### కలుపు నివారణ

శ్రీపద్ధతిలో నీరు నిలువకుండా చూడటంతో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు రోటరీవీడర్‌తో నాటిన పదిరోజులకొకసారి, ఆ తర్వాత పదిరోజులకొకసారి మరో రెండు నుంచి మూడు సార్లు నేలను వీడర్‌తో ముందుకు, వెనక్కి కదిలించటంతో కలుపు మొక్కలు నేలలో కలిసిపోతాయి. రోటరీవీడర్ వాడకటం వలన వేరుకు బాగా ఆక్సిజన్ అందుతుంది. దీంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది స్థిరీకరిస్తాయి. దీంతో వీడర్‌ను ఉపయోగించే ముందు నీటిని అధికంగా ఉంచాలి. వీడర్‌కు మట్టి అంటుకోదు. వీడర్ తేలికగా తిరుగుతుంది. లేదంటే మిగిలిన కలుపు మొక్కలను తీసివేయాలి.

### సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

శ్రీవరిసాగులో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుమువంటి సేంద్రియ ఎరువులను వాడటంతో భూసారం బాగా పెరుగుతుంది. పశువుల ఎరువును ఎకరానికి నాలుగు టన్నులను ఉపయోగించాలి. దీంతోపాటు వానపాముల ఎరువులను వాడాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. శ్రీవరి పద్ధతిలో 8 నుంచి 12 రోజుల్లో నారు వేర్లు బాగా అభివృద్ధి చెంది, బలంగా పెరుగుతాయి. దీంతో ముప్పై నుంచి యాభై పిలకలు వస్తాయి.

### నీరు అందించే పద్ధతి

శ్రీవరిపంటకు సాగునీరందించటంలో చాలా జాగ్రత్త అవసరం. నాటిన వరి పిలకలు బాగా వచ్చేందుకు పొలం తడితడిగా పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. మొక్కల్లల్లో నీరు నిలువకుండా జాగ్రత్త వహించాలి. దీని కోసం ప్రతి రెండుమీటర్లకు 15-20 సెం.మీ. వెడల్పు, 15-20 సెం.మీటర్ల లోతులో సేడులు ఏర్పాటు చేసుకోవాలి. మధ్యమధ్యలో పొలం ఆరితే నీటితో తడుపుతుండాలి. దీంతో పంటవేర్లు ఆరోగ్యంగా బలపడుతాయి. పొలంచుట్టు చిన్నచిన్న ఈనెగట్లు, ఎల్లగట్లు వేసుకోవటం వలన నీటి యాజమాన్యం సక్రమంగా జరుగుతుంది. నీరును పెడుతూ తీయటంతో కలుపు వస్తుందనే భయంతో అధిక నీటిని నిలగడితే పిలకలు రాకుండా పోతాయి. పొలంలో నీటిని బట్టి నీటిని పెట్టడం, తీయటం చేయాలి. తక్కువ నీటితోనే శ్రీవరిసాగు చేయవచ్చును. మూడునాలుగు రోజులకు సాగునీరందిస్తే చాలు శ్రీవరితో అధిక దిగుబడిని పొందవచ్చును.





# భారత్ చేతిలో పాకిస్థాన్ చిత్తు

## చెలరేగిన ఇషాన్ కిషన్

## విజృంభించిన టీమ్ఇండియా బౌలర్లు

కొలంబో : టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా వరుసగా మూడో విజయాన్నందుకుంది. ఆదివారం ఏకపక్షంగా సాగిన గ్రూప్-ఎ పోరులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (77; 40 బంతుల్లో 10x4, 3x6) ధనాధన్ ఇన్నింగ్స్‌తో భారత్ మొదట 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. సయిమ్ అయూబ్ (3/25), తారిఖ్ (1/24) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. బుమ్రా (2/17), హార్దిక్ (2/16), అక్షర్ (2/29), వరుణ్ (2/17) ధాటికి 18 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్ (44; 34 బంతుల్లో 6x4, 1x6) టాప్ స్కోరర్.

లక్ష్యం చిన్నదేమీ కాకపోయినా.. అసాధ్యమైంది కూడా కాదు. కానీ పాక్ ఏ దశలోనూ పోటీలో లేదు. ఛేదన మొదలైన పది నిమిషాల్లోనే ఆ జట్టు ఎదురీదాల్సిన పరిస్థితుల్లో నిలిచింది. పాక్ స్పిన్నర్ల హవా సాగిన పిచ్‌పై.. ఆ జట్టు టాప్ ఆర్డర్ వెన్ను విరిచారు భారత పేసర్లు. హార్దిక్ తొలి ఓవర్లోనే ఫర్హాన్‌ను ఔట్ చేస్తే.. బుమ్రా రెండో ఓవర్లో సయిమ్, సల్మాన్ ఆఘాలను వెనక్కి పంపాడు. 13/3తో పాక్ కష్టాల్లో కూరుకుపోయింది. ఆ తర్వాత స్పిన్నర్ల మాయ మొదలైంది. అయిదో ఓవర్లో బాబర్ అజామ్ (5)ను అక్షర్ ఔట్ చేయడంతో పాక్ 34/4కు పరిమితమైంది. ఆ దశలో ఉస్మాన్ ఖాన్, షాదాబ్ (14) నిలబడి, పరిస్థితిని కాస్త చక్కదిద్దారు. ఉస్మాన్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 10 ఓవర్లకు పాక్ స్కోరు 71/4. కానీ అక్షర్ బౌలింగ్‌లో ఉస్మాన్‌ను ఇషాన్ స్టంపౌట్ చేయడంతో పాక్ పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తర్వాతి ఓవర్లోనే నవాజ్‌ను కుల్‌దీప్, ఆ తర్వాత షాదాబ్‌ను తిలక్ వర్మ ఔట్ చేయడంతో 78/7తో పాక్ ఓటమి ఖాయమైపోయింది.

### ఒత్తిడి తెచ్చినా..:

పరీక్షిస్తున్న పరిస్థితుల్లో అంతకుముందు టీమ్ఇండియా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బంతి బాగా తిరుగుతు న్న పిచ్‌పై పాక్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. భారత బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా టీమ్ఇండియా అంత స్కోరు చేయడానికి ప్రధాన కారణం ఇషాన్ ఇన్నింగ్స్. స్ట్రోక్‌ప్లేకు కష్టంగా ఉన్న పరిస్థితిల్లోనూ అతడు చెలరేగిపోయాడు. దూకుడు లోపించినప్పటికీ



పరిస్థితుల దృష్ట్యా చూస్తే తిలక్ వర్మ (25; 24 బంతుల్లో 2x4, 1x6), కెప్టెన్ సూర్యకుమార్ (32; 29 బంతుల్లో 3x4)ల ఇన్నింగ్స్ కూడా విలువైనవే. ఆఖర్లో దూబె (27; 17 బంతుల్లో 3x4, 1x6) బ్యాట్ ఝుళిపించాడు. మంచి టర్న్ లభిస్తుండడంతో పాక్.. రికార్డు స్థాయిలో ఆరుగురు స్పిన్నర్లను ఉపయోగించింది. టీ20 ప్రపంచకప్‌లో ఇంతకుముందు ఏ జట్టూ ఆరుగురు స్పిన్నర్లతో బౌలింగ్ చేయించలేదు.

### విజృంభించిన బౌలర్లు

కొలంబో అంటే స్పిన్నర్లకు ఎంతో అనుకూలించే మైదానం. ఈ ప్రపంచకప్‌లో అక్కడి పిచ్ మరింతగా స్పిన్నర్లకు సహకరిస్తోంది. దీంతో ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు స్పిన్నర్లకే పెద్ద పీట వేశాయి. ఆటంతా స్పిన్ చుట్టూనే తిరిగింది. ఇప్పటిదాకా టీ20 ప్రపంచకప్‌లో ఏ జట్టూ ఓ ఇన్నింగ్స్‌లో ఆరుగురు స్పిన్నర్లతో బౌలింగ్ చేయించలేదు. పాక్ ఈ రికార్డును ఖాతాలో వేసుకుంది. భారత ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌ను ఆరంభించిందే స్పిన్ ఆల్‌రౌండరైన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా. అతను కీలకమైన అభిషేక్ వికెట్ తీశాడు. మరో స్పిన్ ఆల్‌రౌండర్ సయిమ్ అయూబ్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి 3 కీలక వికెట్లతో అదరగొట్టాడు. ఫాస్ట్‌బౌలర్ షహీన్ అఫ్రిది 2 ఓవర్లు వేసి 31 పరుగులు సమర్పించుకోగా.. మిగతా ఓవర్లన్నీ స్పిన్నర్లే వేశారు. భారత జట్టు ముగ్గురు స్పెషలిస్టు స్పిన్నర్లు వరుణ్, కుల్‌దీప్, అక్షర్‌లను తుది జట్టులో ఆడించింది. వీరికి తోడు పార్ట్‌టైమ్ స్పిన్నర్లు తిలక్, రింకు బౌలింగ్ చేశారు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 31 ఓవర్లు వేసిన స్పిన్నర్లు.. 11 వికెట్లు పడగొట్టారు.

### చెలరేగిన ఇషాన్

మందకొడి పిచ్‌పై టీమ్ఇండియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. స్పిన్‌తో బౌలింగ్ దాడిని ఆరంభించిన పాకిస్థాన్ సత్ఫలితాన్ని రాబట్టింది. అస్థిర ప్రదర్శనను కొనసాగిస్తూ.. ఓపెనర్ అభిషేక్ ఖాతా అయినా తెరవకుండానే నిష్క్రమించాడు. సల్మాన్ ఆఘా అతణ్ని ఔట్ చేశాడు. అభిషేక్ స్థానంలో వచ్చిన తిలక్‌ను బ్యాట్ ఝుళిపించకుండా పాక్ బౌలర్లు అడ్డుకోగలిగారు. కానీ సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ఇషాన్ కిషన్‌ను ఆపలేకపోయారు. పరిస్థితులకు సంబంధం లేకుండా అతడు బ్యాట్ ఝుళిపించాడు. బంతి బాగా టర్నవుతున్నా అతడు తనవైన షాట్లు ఆడడానికి వెనుకాడలేదు. షహీన్ అఫ్రిది బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన అతడు.. ఆఘా ఓవర్లో ఫోర్, సయిమ్ ఓవర్లో ఫోర్, అబ్రార్ ఓవర్లో 6, 4తో విరుచుకుపడ్డాడు. అబ్రార్ మరో ఓవర్లో వరుసగా రెండు బంతులను బౌండరీ దాటించి అర్ధశతకం (27 బంతుల్లో) పూర్తి చేశాడు ఇషాన్. షాదాబ్‌నూ అతడు వదల్లేదు. అతడి బౌలింగ్‌లో వరుసగా 6, 4 దంచేశాడు. 8.3 ఓవర్లలో 88/2తో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. భారీ స్కోరు దిశగా పరుగులుపెట్టింది. కానీ సయిమ్ అయూబ్ బౌలింగ్‌లో ఓ భారీ షాట్ ఆడే ప్రయత్నంలో ఇషాన్ బౌల్డ్ కావడంతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఆ తర్వాత పరుగులు అంత తేలికగా రాలేదు. పాక్ స్పిన్నర్లు.. బ్యాటర్లకు స్వేచ్ఛనివ్వలేదు. పరిస్థితులను అర్థం చేసుకున్న సూర్యకుమార్, తిలక్ ఎక్కువగా సింగిల్స్‌కే పరిమితమయ్యారు. తిలక్ ఎక్కువగా ఇబ్బందిపడకపోయినా.. సాధికారికంగా కూడా కనపడలేదు. అయినా 14 ఓవర్లలో 125/2తో భారత్ బాగానే కనిపించింది. కానీ జోరందుకోవాల్సిన దశలో ఆ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సయిమ్.. వరుస బంతుల్లో తిలక్, హార్దిక్‌లను ఔట్ చేశాడు. సూర్య, దూబె విపరీతంగా బాదకపోయినా.. అయిదో వికెట్‌కు 33 పరుగులు జోడించడం ద్వారా జట్టు స్కోరు 170 దాటడంతో తమ వంతు పాత్ర పోషించారు. దూబె.. నవాజ్ బౌలింగ్‌లో ఫోర్, అబ్రార్ బౌలింగ్‌లో సిక్స్ బాదేశాడు. మిస్టరీ స్పిన్నర్ తారిఖ్ ఓవర్లోనూ ఓ ఫోర్ కొట్టాడు. అయితే ధాటిగా ఆడే ప్రయత్నంలో తారిఖ్ బౌలింగ్‌లో సూర్య ఔటయ్యాడు. షహీన్ అఫ్రిది వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదడం ద్వారా రింకు (11 నాటౌట్) భారత్‌కు విలువైన పరుగులు అందించాడు.

### అభిషేక్ శర్మ కోసం పక్కా ప్రణాళిక

అభిషేక్ శర్మ.. భారత బ్యాటింగ్ ఆర్డర్లో అత్యంత ముఖ్యమైన బ్యాటర్. నిరుడు ఆసియా కప్ ఫైనల్లో అతణ్ని ఆరంభంలోనే ఔట్ చేయడం ద్వారా భారత్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది పాక్. ఇప్పుడు కూడా ఆ జట్టు అతడి కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని మ్యాచ్‌లో అడుగు పెట్టింది. తొలి బంతి నుంచి బాదాలని చూసే అతడికి తొలి ఓవర్లో తనే స్వయంగా స్పిన్ పరీక్ష పెట్టాడు సల్మాన్ ఆఘా. వేగం తగ్గించి, వైవిధ్యం జోడించి బంతులు వేసిన అతను.. అభిషేక్‌ను అసహనానికి గురి చేసి వికెట్ పారేసుకునేలా చేశాడు. ఇక్కడి వరకు పాక్ పాచిక బాగానే పారింది కానీ.. ఇషాన్ రూపంలో ముప్పును పాక్ ఊహించలేకపోయింది. అతను ఎడాపెడా షాట్లు ఆడి పాక్ ప్రణాళికలను దెబ్బ కొట్టి మ్యాచ్‌ను భారత్ వైపు లాగేశాడు.

---

## భారత మహిళా జట్టు శుభారంభం..

### తొలి టీ20లో ఆసీస్‌పై విజయం

ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళా జట్టు విజయంతో ప్రారంభించింది. సిడ్నీ వేదికగా జరిగిన తొలి టీ20లో 21 పరుగుల తేడాతో విజయం (డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి) సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 5.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. ఈ క్రమంలో వర్షం రావడంతో మ్యాచ్ ఆగింది. వరుణుడు ఎంతకీ శాంతించకపోవడంతో ఫలితాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో అంపైర్లు ప్రకటించారు. వర్షం వచ్చే సమయానికి భారత్ అదనంగా 21 పరుగులు చేసి ఉండటంతో విజేతగా నిలిచింది.



## నేపాల్ ఇంటికి.. వెస్టిండీస్ సూపర్ 8కు..

**ముంబయి:** టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ జట్టు హ్యాట్రిక్ విజయాలతో సూపర్ 8కు దూసుకెళ్లింది. గ్రూప్-సిలో భాగంగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్.. 20 ఓవర్లలో 133/8 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన విండీస్ జట్టు.. 15.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. కెప్టెన్ షై హోప్ (61: 44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెట్‌మయర్ (46: 32 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచికొట్టారు. బ్రాండన్ కింగ్ (22) పరుగులు చేశాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమితో నేపాల్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది.



www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



# 'పెద్ది' సినిమాలో కుషిత..

గత ఏడాది రాజ్ తరుణ్ సరసన 'చిరంజీవ' అనే చిత్రంలో నటించి నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కుషిత కల్లపు, ఇప్పుడు ఏకంగా ఒక పాన్ ఇండియా ప్రాజెక్టులో భాగం కాబోతోందనే వార్త ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తోంది. ఈ చర్చలకు ప్రధాన కారణం కుషిత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చేసిన ఒక ఆసక్తికరమైన పోస్ట్. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను ఆమె రీషేర్ చేసింది. సాధారణంగా నటీనటులు తాము నటిస్తున్న సినిమాల అప్‌డేట్స్‌ను మాత్రమే ఇలా షేర్ చేస్తుంటారు. ఇక కుషిత కూడా అదే ఫాలో కావడంతో.. ఈ భారీ చిత్రంలో ఒక కీలక పాత్ర పోషిస్తోందని, ఆ విషయాన్ని ఇలా హింట్ ఇచ్చిందని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్స్ చేస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో రామ్ చరణ్ ఊర మాస్ లుక్‌లో కనిపించబోతున్నారని సమాచారం. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు.వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మక చిత్రంలో కుషితకు అవకాశం దక్కితే, అది ఆమె కెరీర్‌కు ఖచ్చితంగా పెద్ద టర్నింగ్ పాయింట్ అవుతుందని చెప్పవచ్చు.

# రుక్మిణి వసంత్ క్యూట్ స్మైల్

చాలా తక్కువ కాలంలో పాన్ ఇండియా రేంజ్లో గుర్తింపును సంపాదించుకున్న వారిలో రుక్మిణి వసంత్ ఒకరు. ఈమె 'సప్త సాగరాలు దాటి' అనే కన్నడ సినిమాతో వెండితెరకు పరిచయం అయ్యింది. ఈ సినిమా సైడ్ ఏ, సైడ్ బి అనే రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాలను అందుకుంది. ఈ మూవీలలో రుక్మిణి నటనతో, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఈమెకు మంచి గుర్తింపు వచ్చింది. కొంతకాలం క్రితం ఈ నటి 'కాంతారా చాప్టర్ 1' అనే చిత్రంతో ప్రేక్షకులను పలకరించి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రంతో ఈమె క్రేజ్ మరింతగా పెరిగింది. ప్రస్తుతం రుక్మిణి, తారక్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.





# నాకు పెళ్లయిందని చెప్పాక సినిమా నుండి తీసేశారు : స్రవంతి

బిగ్‌బాస్ కార్యక్రమం ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకున్న స్రవంతి చొక్కారపు ప్రస్తుతం వరుస సినిమా ఈవెంట్లకు యాంకర్‌గా వ్యవహరిస్తూ బిజీగా కెరీర్‌ని ముందుకు సాగిస్తుంది. ఈమె తాజాగా సుహాస్ హీరోగా, శివానీ నాగారం హీరోయిన్‌గా రూపొందిన హే భగవాన్ సినిమాలో కీలక పాత్రలో నటించింది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 28వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా స్రవంతి ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో భాగంగా తన కెరీర్లో ఎదురైన ఒడిదుడుకుల గురించి వివరించింది. తాజాగా స్రవంతి మాట్లాడుతూ... "నేను సినిమా ఇండస్ట్రీలోకి చాలా సంవత్సరాల క్రితం వచ్చాను. సినిమా ప్రయత్నాలు చేస్తున్న సమయంలో నాకు ఓ మూవీలో అవకాశం వచ్చింది. ఆ సినిమాలో నన్ను హీరోయిన్‌గా అనుకున్నారు. నాకు చాలా ఆనందం వేసింది. ఆ తర్వాత వారు హీరోతో పాటు నన్ను కూడా ఫోటోషూట్ చేశారు. అందులో కూడా వారు సాటిస్‌ఫై అయ్యారు. మొత్తం ఓకే అయింది. అడ్వాన్స్ చెన్నైలో ఇస్తాం అన్నారు. అంతా ఓకే అయ్యాక నేను నాకు పెళ్లయింది అని చెప్పాను. ఆ తర్వాత నాకు ఆ మూవీ బృందం నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ రాలేదు. ఆ తర్వాత వారు నన్ను ఆ సినిమాలో తీసుకోలేదు. అలా పెళ్లయింది అనే కారణంతో నాకు వచ్చిన సినిమా అవకాశం కూడా పోయింది. ఇక ఎన్ని సంవత్సరాల తర్వాత నాకు హే భగవాన్ చిత్రంలో మంచి అవకాశం వచ్చింది. ఈ సినిమా దర్శకుడు గోపి నాకు ఇది ఫస్ట్ సినిమా అయినా ఎలాంటి ఆడిషన్స్ చేయకుండా తీసుకున్నాడు. ఈ మూవీని చాలా చక్కగా తెరకెక్కించాడు. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని, నాకు మంచి పేరును తీసుకువస్తుందని భావిస్తున్నట్లు స్రవంతి తెలియజేసింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com